క్లుప్తంగా

నూతన వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం



ఆగిరిపల్లి: మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం కల్లుటూరుకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కోట వినోద్‌రావు కుమారుడు వంశీ వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ రాఘవరపు సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావం

తిరువూరు: విశాఖపట్నంలోని స్టీల్ ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బలగాని వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరువూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులకు సంఘీభావంగా, ప్రభుత్వ వైఖరికి నిరసన తెలుపుతూ ఆందోళనా కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు జారీచేయకుండా అకారణంగా కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఇది చట్టవ్యతిరేకమని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వెంటనే కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు సామ్రాజ్యం, రమణ, కృష్ణవేణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు



విస్సన్నపేట: బేర్ మొక్కజొన్న సీడ్ కంపెనీ వలన మండలంలోని కొండపర్వ గ్రామంలో కొంతమంది రైతులు, కౌలురైతులు నష్టపోయారని, వారికి నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. బేర్ మొక్కజొన్న కంపెనీ సీడ్ వలన కొండపర్వ గ్రామంలో 16 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, కంపెనీ ఆర్గనైజర్లు చెప్పిన మాటలు విని ఎకరానికి నాలుగు నుంచి ఐదు టన్నులు పండుతుందని నమ్మించారన్నారని తెలిపారు. తగిన దిగుబడి రానందున నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణికి వినతిపత్రం అందజేశారు.

నమ్మాళ్వార్ నక్షత్ర విశేష పూజలు

తిరువూరు: వైష్ణవ ఆధ్యాత్మిక వేత్త నమ్మాళ్వార్ నక్షత్రం సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పన్నెండు మంది ఆళ్వార్లలో ఒకరైన నమ్మాళ్వార్ పురాతన కాలం నుంచి వైష్ణవ దేవాలయాల విశిష్టతను ప్రపంచానికి చాటిచెబుతూ, సంప్రదాయాలను గురించి తెలియజేసిన ఆధ్యాత్మిక వేత్తగా ప్రసిద్ధి చెందారని శ్రీలక్ష్మీ నరసింహ ఉపాసకులు ఎన్‌సీహెచ్ విఠలాచార్యులు పేర్కొన్నారు. తిరువూరులోని శ్రీదాసాంజనేయస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, శ్రీవేంకటాలస్వామి దేవస్థానాలలో పూజాదికాలు జరిగాయి.

వాషింగ్ మిషన్ బహూకరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని శ్రీవిద్య మానసిక దివ్యాంగుల సంస్థకు హరివిల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాషింగ్ మిషన్, తినుబండారాలను సోమవారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మహ్మద్ రఫీ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా వివిధ స్వచ్ఛంద సంస్థలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ చిన్నారులతో కొద్దిసేపు గడిపి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శరత్‌కుమార్, సహాయ కార్యదర్శి కనకారావు, హోమ్ నిర్వాహకులు బి.అమల పాల్గొన్నారు.

కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మైలవరం: ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని రెడ్డిగూడెం మండలం వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్ తెలిపారు. రెడ్డిగూడెం ఎస్సీ కాలనీ వెల్నెస్ సెంటర్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాబర్ట్ మాట్లాడుతూ కన్నులేకపోతే జీవితమే అంధకారం అవుతుందన్నారు. అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 80 మందికి నేత్ర వైద్యులు పల్లెపాం లక్ష్మీకుమారి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పొరలు, కంటి చుక్కలు ఉన్న వారిని విజయవాడ చైతన్య కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. రెడ్డిగూడెం సొసైటీ ప్రెసిడెంట్ గుడిస ప్రభాకరరెడ్డి, కులదీప్‌రెడ్డి, రామిరెడ్డి, చాట్ల ఆదాము, అభ్యుదయ యువ శక్తి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, చాట్ల రాజేష్, విస్సన్నపేట సిరి ఆప్టికల్స్ అధినేత వెంపటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద కోతలు.. రైతులకు వెతలు

- బుడమేరు వరద కోతకు గురైన సాగు భూములు
- గండ్ల మట్టి మేటలతో రైతుల పాట్లు
- గండ్లను మాత్రమే పూడ్చుతున్న కాంట్రాక్టర్లు
- సొంత ఖర్చుతో మేటలను తొలగించి గోతులను పూడ్చుతున్న రైతులు




వెల్లటూరు శివారులో వరదకు వ్యవసాయ భూమిలో ఏర్పడిన గొయ్యి ; వెల్లటూరు శివారులో బుడమేరుకు పడిన గండి వద్ద చెరువులా మారిన సాగుభూమి

జి.కొండూరు: గత ఏడాది ఆగస్టులో వచ్చిన వరద పోటుతో బుడమేరుకు, చెరువులు, వాగులు, కాల్వలకు భారీగా గండ్లు పడ్డాయి. ఈ గండ్ల వలన సాగు భూముల్లో మట్టి మేటలు వేసింది. వరద ప్రవాహానికి గండ్ల వద్ద సాగు భూములు కోతకు గురై అడుగుల లోతు గోతులు ఏర్పడ్డాయి. అయితే వరద వచ్చిన తొమ్మిది నెలలకు గండ్లను పూడ్చే పనులను అధికారులు చేపట్టారు. కానీ మేటలు, వరద కోతల వలన ఏర్పడిన గొయ్యిలను మాత్రం అలానే వదిలేస్తున్నారు. ఇదే ఇప్పుడు రైతులకు సమస్యగా మారింది.

వెల్లటూరులో భారీగా నష్టం

మండల పరిధిలోని వెల్లటూరు పడమర చెరువు 260 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద వెల్లటూరు, హెచ్ ముత్యాలంపాడు, ఆత్కూరు, చెవుటూరు గ్రామాలకు చెందిన 1,250 ఎకరాల వరకు సాగు భూమి ఆయకట్టుగా ఉంది. ఈ చెరువు వెల్లటూరు గ్రామ శివారులోని బుడమేరు వాగును ఆనుకొని ఉంటుంది. గతేడాది బుడమేరుకు వచ్చిన వరదల వలన ఈ చెరువుకు నాలుగు చోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఈ చెరువుకు ఆనుకొని ఉన్న బుడమేరుకు అర కిలోమీటరు మేర భారీ గండి పడింది. దీంతో వేయి ఎకరాల వరకు వరి పైరుకు నష్టం వాటిల్లింది. ఈ గండ్ల మట్టి ఆయకట్టు సాగు భూమిపై మేటలు వేసింది. గండ్లు పడిన ప్రదేశంలో ఉన్న సాగు భూమిలో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇలా వంద ఎకరాల వరకు గొయ్యిలు, మేటల కారణంగా రైతులు లబోదిబోమంటున్నారు.

సాగు భూముల్లో గొయ్యిలు, మేటల సంగతేంటి

ఇటీవల ఈ గండ్లు పూడ్చే పనులు మొదలు పెట్టి ఎనభైశాతానికి పైగా పూర్తి చేశారు. కానీ సాగు భూమిలో ఏర్పడిన గోతులను, మేటలను అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పట్టించుకోపోవడం వలన రైతులే సొంత ఖర్చుతో మేటలను తొలగించి గోతులను పూడ్చుతున్నారు. మరి కొందరు చిన్న, సన్నకారు రైతులు ఆర్థిక సమస్యలతో గోతులను పూడ్చలేక, మేటలను తొలగించలేక ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కవులూరు గ్రామానికి చెందిన రైతు చెరుకూరి సాంబశివరావు తన పొలంలో బుడమేరు వరదలకు ఇరవై అడుగుల మేర భారీ గొయ్యి ఏర్పడిందని, దానిని పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఈ నెల ఆరో తేదీన కవులూరు వచ్చిన కలెక్టర్ లక్ష్మీశను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గుంతలను పూడ్చాలని కాంట్రాక్టరును ఆదేశించారు. త్వరలో ప్రారంభిస్తామని కాంట్రాక్టరు సైతం రైతుకు హామీ ఇచ్చారు. గండ్లు పడిన ప్రదేశంలో మేటలు తొలగింపు, గోతులను పూడ్చే పనులను కాంట్రాక్టర్లు చేపడితే ఆర్థిక కష్టాలు తప్పుతాయని రైతులు కోరుతున్నారు.

సాగు భూముల్లో గోతులు పూడ్చాలి



నాకు వెల్లటూరు పడమర చెరువు కింద 60 సెంట్ల సాగు భూమి ఉంది. పోయిన సంవత్సరం బుడమేరుకు వరద రావడంతో చెరువుకు నాలుగుచోట్ల గండ్లు పడ్డాయి. చెరువు గండి వద్దనే నా పొలం ఉండడంతో భారీ గుంత ఏర్పడింది. గండి పూడ్చారు, కానీ గుంత పూడ్చలేదు. ప్రభుత్వమే గోతులను పూడ్చేలా చర్యలు చేపడితే మేలు జరుగుతుంది.

– రాజులపాటి నాగరాజు, రైతు, వెల్లటూరు

సొంత ఖర్చుతో తొలగిస్తున్నాం



నాకు వెల్లటూరు పడమర చెరువు కింద రెండెకరాల సాగు భూమి ఉంది. పోయిన సంవత్సరం వచ్చిన వరదల కారణంగా చెరువుకు గండ్లు పడి నా పొలంలో మట్టి మేట వేసింది. పైరు పూర్తిగా పాడైపోయింది. ఈ మేటలను తొలగించేందుకు ప్రభుత్వం ఎటువంటి సాయం చేయకపోవడంతో సొంత ఖర్చుతోనే మేటలను తొలగించుకుంటున్నాం.

– మాదు నాగయ్య, రైతు, వెల్లటూరు గ్రామం

నెలలో రెండుసార్లు కోకో గింజలు కొనుగోలు చేయాలి



నూజివీడు: నెలకు రెండుసార్లయినా నూజివీడు ప్రాంతంలో కోకో గింజలు కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరారు. మండలంలోని ముక్కొల్లుపాడులో కోకో గింజల కొనుగోలు గురించి రైతులతో సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ సోమవారం చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కిలో రూ.500కు కొనుగోలు చేస్తున్నారని, ఈ ధర అందుతుందా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ ఉద్యానశాఖ నుంచి సర్టిఫికెట్లు తీసుకున్నామని, సంబంధిత కంపెనీ వారు ఈనెల 10న వచ్చి కోకో గింజలు కొనుగోలు చేయనున్నారని చెప్పారు. తహసీల్దార్ గుగులోతు భద్రూ, డెప్యూటీ తహసీల్దార్ బీవీ సుబ్బారావు, ఉద్యాన అధికారిణి ఆర్ హేమ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, కోకో రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీ

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లి హీల్ సంస్థలో ఇద్దరు దివ్యాంగులకు దాత బొబ్బ మంజుల (యూఎస్‌ఏ) ఆర్థిక సాయంతో కృత్రిమ కాళ్లను విశ్రాంత ఆర్ అండ్ బీ ఇంజినీర్ తాటినేని జితేంద్రనాథ్, స్వర్ణ చేతుల మీదుగా దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా హీల్ సంస్థ ఫెసిలిటీస్ డైరెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఇంతవరకు 709 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేసినట్లు తెలిపారు.

యోగాసనాలను సమాజానికి దగ్గర చేయడమే లక్ష్యం

నూజివీడు: ప్రతిరోజూ యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీడీఓ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నూజివీడు మండలం సంపూర్ణ యోగా మండలంగా గుర్తింపు పొందాలంటే పొదుపు మహిళలు ప్రతి ఒక్క కుటుంబానికి యోగాను పరిచయం చేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ బీవీ సుబ్బారావు, ఏఓ ఏ చాముండేశ్వరి, డీవైఈఓ సేవియా నాయక్, ఏపీఓ మీనాక్షి, ఏపీఓ పచ్చిగళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం మెరుగు

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రలో భాగంగా పట్టణంలో సోమవారం నూజివీడు మున్సిపాలిటీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా ఒత్తిడిని సైతం తగ్గిస్తుందన్నారు. డీఎల్‌డీఓ పీ వెంకటరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ ఆఫీసు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు: భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి ప్రాచుర్యంలో ఉన్న యోగాసనాలను నేటి సమాజానికి దగ్గర చేయడమే ప్రపంచ యోగా దినోత్సవ లక్ష్యమని తిరువూరు ఆర్డీవో కే మాధురి అన్నారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్, మెప్మా సిబ్బందికి యోగా శిక్షణ తరగతులను ఆమె సోమవారం ప్రారంభించారు. నిత్యం పనుల ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు కొద్దిసేపు యోగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్డీవో సూచించారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, తహసీల్దారు లక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

విస్సన్నపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకొని యోగాంధ్ర ర్యాలీని అధికారులు సోమవారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి ఈనెల 21 అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని గురించి, యోగా వలన ఉపయోగాలను ఎంపీడీఓ చేకు చినరాటాలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ గోపాలకృష్ణ, ఏపీఎం జమలయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



తిరువూరులో యోగా శిక్షణ పొందుతున్న సిబ్బంది



ఇబ్రహీంపట్నంలో యోగాంధ్ర ర్యాలీ



నూజివీడులో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

యోగాతో మానసిక ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: ప్రతిరోజు యోగా చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం, శారీరక దారుఢ్యం కలుగుతాయని యోగా గురువు లంకే జనార్ధన్ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. యోగా సాధకులతో వార్డు సచివాలయం నుంచి స్థానిక రింగ్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో భావోద్వేగాలు, క్షణికావేశాలు తగ్గి సమాజంలో శాంతి సామరస్యం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, ఆయుష్ మెడికల్ అధికారి జునిద్, సచివాలయ ఉద్యోగులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

ముసునూరు: క్రమం తప్పని యోగా, ధ్యానంతో మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమని ఎంపీడీఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాభ్యసనాల ద్వారా పలు ఆసనాలు, ధ్యానం, సూర్య నమస్కారాలు చేసి, మంచి ఆరోగ్యయోగం పొందాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ రమణ, పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

జి.కొండూరు: ప్రతి రోజూ యోగా చేయడం వల్లన ఎన్నో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. అంతర్జాతీయ యోగా మాసోత్సవాలలో భాగంగా మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో జి.కొండూరులో అవగాహనా ర్యాలీని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ మండల అరుణ, ఎంపీడీఓ బీవీ.రామకృష్ణనాయక్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ డెప్యూటీ ఎంపీడీఓ బసవ లింగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

ఆగిరిపల్లి: యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆగిరిపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాపై అవగాహన ర్యాలీలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ భార్గవి, ఎస్ఐ శుభశేకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభ శేఖర్ మాట్లాడుతూ యోగా వల్ల జీవన విధానం మెరుగుపడుతుందని తెలిపారు.

అంబేడ్కర్ వ్యాస సంకలనం ఆవిష్కరణ



వ్యాస సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఇళ్ల రవి, ప్రొఫెసర్ ఆచార్య కొండపల్లి సుదర్శన్ రాజు

మైలవరం: తెలుగు సాహిత్యంలో అంబేడ్కర్ మనుస్మృతి అనే ప్రత్యేక వ్యాస సంకలనాన్ని ప్రముఖ విద్యావేత్తలు సోమవారం ఆవిష్కరించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలోని అంబేడ్కర్ స్మృతి వనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాదముల వద్ద ఈ ప్రత్యేక వ్యాస సంకలనాన్ని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి, ఇతర విద్యావేత్తలతో కలిసి ఆవిష్కరించినట్లు సంపాదకుడు డాక్టర్ మెండా దేవానంద్‌కుమార్ తెలిపారు. అంబేడ్కర్ ఆశయాలు ఎంతో మహోన్నతమైనవని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. తాను 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ సామాజిక దృక్పథాలు' అనే వ్యాసం రాయడం గొప్ప ఆనందాన్ని కలిగించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకై అంబేడ్కర్ నిలబడిన తీరు అమోఘం అన్నారు. ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కొండపల్లి సుదర్శన్‌రాజు మాట్లాడుతూ సరైన సమయంలో సరైన వ్యాస సంకలనం ఇదన్నారు. ఈ వ్యాస సంకలనంలో తొలి తరం దళిత కవులను స్మరించి వారి రచనా వ్యాసాంగాలు చేయడం అద్భుతం అన్నారు. బి.వీణ, గౌరవ సంపాదకులు డాక్టర్ పీ నాగయ్య, డాక్టర్ మెండా దేవనందకుమార్ ప్రసంగించారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదే



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

మైలవరం: విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులదేనని కాకినాడ జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, పూర్వ వైస్ చాన్సలర్ కేఎస్‌వీ జీకే.మురళీకృష్ణ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, ఏఐ అండ్ డీఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ టీచింగ్ పెడగోగి ఆవిష్కృత బోధనాంశాల శిక్షణ అనే అంశంపై అధ్యాపకులకు ఐదు రోజులు శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులను మంచి విద్యార్థిగా తీర్చి దిద్దాలంటే మొదట ఎలా బోధించాలో శిక్షణ పొందాలన్నారు. అధ్యాపకులకు భాష మీద పట్టు ఉండాలన్నారు. లెర్న్ నాట్ ఫర్ స్కూల్ బట్ లైఫ్ అనే స్ఫూర్తితో అధ్యాపకులు మొదట స్ఫూర్తి పొంది విద్యార్థులకు అట్టి విధానములో శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి, కన్వీనర్లు ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కే.ఆర్.ఎల్.ప్రసాద్, డాక్టర్ పి.భగత్, కోఆర్డినేటర్లు డాక్టర్ ఓ రమాదేవి, ప్రొఫెసర్ ఏఐ అండ్ డీఎస్ కే సుధాకర్, వివిధ డిపార్ట్‌మెంట్‌ల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బాలికలకు ఫైరింగ్‌లో శిక్షణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదవ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ గుంటూరు ఆధ్వర్యంలో కేతనకొండలోని సీబీఆర్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న శిబిరం కొనసాగుతోంది. మూడవ రోజు శిబిరాన్ని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ సోమవారం ప్రారంభించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ నుంచి వచ్చిన ఏఆర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు 70 ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించి, జాగ్రత్తలను వివరించారు. కేడెట్లను కొండపల్లి ఖిల్లాకు తీసుకువెళ్లి అక్కడి ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ ఎమ్ఎస్ఎన్ స్వాతివ్యక్తిత్వ వికాసం, ఎన్‌డీఏ డిఫెన్స్ ఫోర్స్‌లో ఉన్న త్రివిధ దళాలపై అవగాహన కల్పించారు. సుబేదార్ మేజర్ షేక్ ఇమామ్ సాహెబ్, ట్రైనింగ్ జేసీఓ ఆర్ఎస్ రాజు, పీఐ స్టాఫ్, క్యాంప్ సూపరింటెండెంట్ కొల్లా రాజశేఖర్ బాబు, ఏఎన్‌ఓలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



తూర్పు చెరువు నుంచి మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

జి.కొండూరు: రైతుల పొలాలకు మెరక పేరుతో అనుమతులు పొంది మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న ఘటన మండల పరిధిలోని వెల్లటూరులో సోమవారం వెలుగు చూసింది. చెరువులో సారవంతమైన మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు టీడీపీ నాయకులు పన్నిన కుట్రని గ్రామస్తులు తిప్పికొట్టారు. గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారంటూ గ్రామస్తులు మట్టి రవాణాను అడ్డుకున్నారు.

బట్టీలకు తరలింపు

కుంటముక్కల గ్రామంలోని తూర్పు చెరువు 99 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద 600 ఎకరాల ఆయకట్టుగా ఉంది. గ్రామానికి చెందిన కూటమి నాయకులు కొందరు ముగ్గురు రైతుల పేరుతో మూడు వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతి పొందారు. ఈ క్రమంలో రెండు ప్రొక్లయిన్లు 70 ట్రాక్టర్లతో ఇటుక బట్టీలకు మట్టి తరలింపును సోమవారం ఉదయం ప్రారంభించారు.

అడ్డుకున్న గ్రామస్తులు

మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్న క్రమంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో చెరువు మట్టిని తరలించి కొందరు వ్యక్తులే సొమ్ము చేసుకుంటున్నారని, గ్రామంలో వనరులను అమ్ముకుంటున్నప్పుడు గ్రామాభివృద్ధికి నిధులు ఎందుకు కేటాయించరంటూ నిలదీశారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయింపుపై హామీ ఇచ్చే వరకు మట్టి తరలింపు సాగనివ్వమని తేల్చి చెప్పారు. దీనితో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అదుపు చేశారు.

రైతులకు అనుమతులు ఇచ్చాం

పొలాలకు మెరక కోసం కుంటముక్కల గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ గ్రామంలో తూర్పు చెరువు నుంచి ముగ్గురు రైతులకు మూడు వేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలింపునకు అనుమతి ఇచ్చాం.

– రాజేష్, జేఈ, ఇరిగేషన్, జి.కొండూరు

హెల్మెట్ ఆవశ్యకతపై వీడియో ప్రదర్శన

తిరువూరు: గంపలగూడెం మండలం లింగాలలో ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ పోలీసులు సోమవారం రాత్రి వీడియో ప్రదర్శన నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం ద్విచక్రవాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నందున హెల్మెట్ ధరించి వాహనం నడపాలని ఎస్ఐ శ్రీను గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలు, బాలికలతో అపరిచిత వ్యక్తులు అనుసరించే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల తేడా, చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాల గురించి ఎస్ఐ అవగాహన కల్పించారు.

విద్యార్థిని అంజలికి ప్రభుత్వ ప్రతిభా పురస్కారం



మైలవరం: మైలవరం మండలం పోరాటనగర్‌కు చెందిన ఆంగోతు అంజలి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం వారిచే ప్రతిభా పురస్కారం లభించింది. ఈ మేరకు ఇంటర్మీడియేట్ సీఈసీలో 1000 మార్కులకు గాను 937 మార్కులు సాధించి తన ప్రతిభ కనబర్చింది. అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభను కనబర్చినందుకు గాను విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ చేతుల మీదుగా ఆంగోతు అంజలి ప్రశంశా పత్రం, గోల్డ్ మెడల్ తో పాటు రూ.20వేలు చెక్కును రాష్ట్ర ప్రభుత్వం తరపున అందుకుంది. ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకోవడం తనకు చాలా ఆనందంగా ఉందని తెలిపింది. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం నుంచి తమ కుమార్తె ప్రతిభా పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని అంజలి తల్లిదండ్రులు ఆనంద నాయక్, జయలక్ష్మి దంపతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.అదే విధంగా గ్రామస్తులు, ప్రముఖులు అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 14 అర్జీలు స్వీకరణ

నూజివీడు: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 14 అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్ అర్జీలను స్వీకరించి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని, గడువులోగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పరిష్కరించడానికి వీలు కాకపోతే దానికి గల కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఇన్‌చార్జి ఏడీఏ ఏ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న నివాస గృహాలు

చాట్రాయి: స్థానికంగా ఆదివారం గాలివాన బీభత్సానికి చాట్రాయిలో తొమ్మిది ఇళ్లు పూర్తిగా, ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని బూరుగగూడెంలో ఒక ఇల్లు పూర్తిగా, రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని వివరించారు.